

## వాహనం బోల్తా

**ప్రజాశక్తి-అరకులోయరూరల్:** మండలంలోని చొంపి వంతెన వద్ద బొలెరో వాహనం సోమవారం ప్రమాదానికి గురైంది. అరకులోయ పట్టణం నుంచి సుమారు 50 సిమెంట్ బస్తాల లోడు వేసుకొని పప్పుడువలస వెళ్తుండగా బోల్తా పడింది. వంతెనకు ఇరువైపులా రక్షణగోడ లేక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. వంతెన శిథిలావస్థకు చేరి రక్షణ గోడ కూలడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థకు గురైన వంతెన మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.



బోల్తా పడిన బొలెరో

# మంచం పట్టిన మద్రేబు

## - విజృంభిస్తున్న వ్యాధులు -ఆసుపత్రులకు తరలింపు-దిక్కుతోచని స్థితిలో ఇంటికే పరిమితం



వ్యాధులతో బాధపడుతున్న కుటుంబ సభ్యులు

**ప్రజాశక్తి-అనంతగిరి:** ఇటీవల కురుస్తున్న వర్షాలతో మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు విజృభిస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక రోగులు మంచాన పట్టారు. అనంతగిరి మండలం పిన్నకోట ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దకోట పంచాయతీ కొండ శిఖరం గ్రామమైన మద్రేబు గ్రామంలో సుమారు 30 మంది పైగా గిరిజనులు గత మూడు వారాల నుండి పలు వ్యాధులతో మంటం పట్టారు. పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 30 కిలోమీటర్లు కొండకోన నడుమ నుండి పిన్నకొట ఆసుపత్రికి, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ బొడ్డగుమ్మి వరకు ఎనిమిది కిలోమీటర్లు డోలీలో వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ నుంచి ఆటోలో దేవరాపల్లి చేరుతారు. కీర్తనకు డెంగీ ప్రబలడంతో కే.జీ.హెచ్ కి తరలించారు. కొండతాంబలి కవితకు జ్వరం, పిట్సు రావడంతో దేవరాపల్లి తరలించగా పరిస్థితి విషమంగా ఉండంతో మెగుగైన వైద్యం కోంసం కేజిహెచ్‌కు రిపర్ చేశారు. పలువురు వివిధ వ్యాధులతో మంచం పట్టారు. వీరిలో



మంచం పట్టిన మహిళ



డోలీలో తరలిస్తున్న బంధువులు

కొండతాంబిల్లి లింగన్న, కొండతాంబలి పూసే, కొండతాంబిల్లి .రవి, సునీత, అభి,.నిషాకా, అశోక్, చిన్ని, బిషీలతో పాటు 20 మంది మంచంపై పడి వైద్య కోసం ఎదురుచూస్తున్నారు. తక్షణమే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.



ప్రజల సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

## స్పందన అర్జీలను పరిష్కరించాలి

### - ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

**ప్రజాశక్తి - రంపచోడవరం**

స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 40 అర్జీలు అందాయి. వాటిని పిఒతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. వై.రామవరం మండలం బంగారు బంధాలు గ్రామంలో జిపిఎస్ స్కూల్లో 30 మంది విద్యార్థులు ఉన్నారని, రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని చింతలపూడి ఉపసర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, పల్లాల మల్లు రెడ్డి విన్నవించారు. తనకు రుణం మంజూరు చేయాలని బుల్లెజ్ పాలెం గ్రామానికి చెందిన చిలకల సుబ్బాయమ్మ దరఖాస్తు సమర్పించారు. తనకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని పోలవరం ప్రాజెక్టు ప్రభావిత దేవీపట్నం మండలం మడిపల్లి గ్రామానికి చెందిన 18 ఏళ్ల ముర్ల లలిత ప్రియా వినతిపత్రం అందించారు. అడ్డతీగల మండలం శెట్టిపల్లిలో మా భూ సమస్య పరిష్కరించాలని ఈక బాపన్నదొర కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్‌రాజ్, నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, కె.సుబ్బయ్య, డాక్టర్ ఓబి ఇందిరా, ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్.జి భాస్కర్, డాక్టర్ రాధిక, డాక్టర్ గోపిక, పిహెచ్‌ఒ కె.చిట్టిబాబు. వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సావిత్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన



ఖాళీ బిందెలతో ఆందోళన చేపడుతున్న గిరిజనులు

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం మారుమూల ప్రాంతమైన కుంతుర్ల పంచాయతీ బర్రెమామిడి గ్రామంలో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన చేపట్టారు. రక్షిత మంచినీటి కొరతతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. బర్రె మామిడి గ్రామంలోని ఏడు వీధులలో 120 కుటుం బాలు నివసిస్తున్నాయని, గత కొంతకాలంగా మంచినీటి సమస్యతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. గత్యంతరం లేక కొండవాలులో నీటిని సేకరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు తాము సేకరిస్తున్న ఊట నీరు కలుషితమవుతోందని, అయినప్పటికీ ఆ నీరే తాగవలసిన దుస్థితి ఏర్పడిందని గ్రామ ప్రజలు వాపోయారు. అనేకమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీసం పట్టించుకోలేదని మహిళలు వాపోయారు. ఐటీడీఏ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశామని, తమ సమస్య మాత్రం పరిష్కారం మార్గం కాలేదదన్నారు కలుషిత నీరు తాగడంతో విష జ్వరాలు, టైఫాయిడ్ వంటి రోగాల బారిన తిన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఈ సీజన్లో వరి నాట్ల పనులు మానుకొని మంచినీటి కోసం అవస్థలు పడవలసిన పరిస్థితి ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్ అలంకారప్రాయంగా మారిందన్నారు. ఏడు వీధులకు సంబంధించి కుళాయిలు నిరుపయోగంగా పడి ఉన్నాయని, తక్షణమే అధికారులు స్పందించి బర్రె మామిడి గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో తామంతా పాడేరు కదిలి వచ్చి ఐటిడిఏ ఎదుట మహిళలతో పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంతల భీమ్ నాయుడు, బోనంగి మత్య కొండపడాల్, లోచలి పుష్పాలమ్మ, కించే కళావతి, వంతాల కాసులమ్మ, సిర్గం సావిత్రమ్మ, పూటి పోతురాజు పాల్గొన్నారు.

### నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాలకు

## దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-పాడేరు:** 2024-25 విద్యా సంవత్సరానికి జవహార్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆగస్టు 10 వతేదీలోగా నవోదయ వెబ్ సైట్లో దరఖాస్తు చేయాలని సూచించారు. 2024 సంవత్సరం జనవరి 20న ప్రవేశ పరీక్ష. నిర్వహించడం జరగుతుందన్నారు. రాత పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు చింతూరు డివిజన్ పరిధిలోని ఎటపాక నవోదయ విద్యాలయంలో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో ఏడు మండలాలు, చింతూరు పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## వికలాంగులకు ప్రవేశాలు

**ప్రజాశక్తి- పెదబయలు రూరల్:** పెదబయలులో జెడ్పీ హైస్కూల్‌లో వికలాంగులకు ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రధాన ఉపాధ్యాయులు సతీష్ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల నేరుగా పాఠశాలకు రావాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్యతో పాటు సంబధిత రాయితీలు పొందవచ్చని తెలిపారు.సదరం సర్టిఫికెట్ చేయించుకొనుటకు కావలసిన సమాచారం కూడా అందించబడుతుందని చెప్పారు. రోజువారీ వచ్చే పిల్లలకు ఏస్కార్ట్ అలవన్స్ సదుపాయం కలదని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.



మాట్లాడుతున్న పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు

## పోలవరం నిర్వాసితుల సంస్కృతి, సంప్రదాయాలు నాశనం

### - పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు

**ప్రజాశక్తి-విఆర్ పురం**

పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన ఈ ప్రాంత ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు కట్టి ప్రజా కళలను గోదావరిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముంచుతున్నాయని పేర్కొన్నారు. కూనవరం మండలం రేపాకలో సోమవారం జరిగిన పిఎన్ఎం మండల సమావేశం కారం కన్నారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంగరాజు ఇటీవల జరిగిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల మహా పాదయాత్రలో అగ్ర భాగాన కళారూపాలు ప్రదర్శించిన కళాకారులను మంగరాజు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి వివిధ కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కృషి చేస్తుందని చెప్పారు. పిఎన్ఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని కళారూపాలు తయారు చేసి, ప్రజల్లో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.



ఫిర్యాదు చేస్తున్న ఎస్‌పి

## ఎస్‌పికి సర్పంచుల ఫిర్యాదు

**ప్రజాశక్తి-పాడేరు:** 14,15వ ఆర్థిక సంఘం నిధులు కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని గిరిజన సర్పంచులు డిమాండ్ చేశారు. 6కోట్ల అరవై ఒక లక్షల నలభై వేల ఏడు వందల నాలుగు రూపాయలు పంచాయతీ ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు సర్పంచులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధంగా పంచాయతీలకు ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు కావస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలో జమ చేస్తే సర్పంచ్ అనుమతి, పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ ఖాతాలో ఉన్న నిధులను రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం తీసుకోవడం రాజ్యాంగ పరంగా, చట్ట పరంగా విరుద్ధమని తెలిపారు. పంచాయతీ ఖాతాలో జమ చేయకపోవడంతో పంచాయతీల అభివృద్ధి కుంటిపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరు మారకపోతే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు, సర్పంచ్‌లు బాకూరు వెంకటరమణ రాజు, పాంగి పాండురంగ స్వామి, కంబిడి సరోజినీ, తామర్ల సత్యనారాయణ,శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, హుకుంపేట మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, టీడీపీ సీనియర్ నాయకులు కంబిడి జ్ఞాన ప్రకాష్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి


### సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

**ప్రజాశక్తి-విఆర్.పురం**

గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తుగా సహాయ చర్యలు చేపట్టాలని, ఇందు కోసం అధికారులను నియమించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అధ్యక్షన జరిగిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ గోదావరి వరద సహాయక చర్యలు చేపట్టాలని. ప్రతి నిర్వాసితుడికీ బరకం, కిరోసిన్, కొవ్వొత్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ నిర్వాసితులకు ముందుగానే షెటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, పెద్దమటపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, చిన్నమట్టపల్లి ఎంపిటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, వడ్లది రమేష్, కారం సుందరయ్య, కుంజ నాగిరెడ్డి, గూటాల శ్రీను, పులి బుజ్జి, సున్నం నాగమ్మ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



వినతిపత్రం ఇస్తున్న వీరభద్రరావు తదితరులు

## అల్లూరి విజ్ఞాన కేంద్రానికి స్థలం కేటాయించాలి

**ప్రజాశక్తి-కొయ్యూరు :** అల్లూరి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో తొలగిస్తామంటున్న కాకరపాడు సెంటర్‌లోని అల్లూరి నిలువెత్తు విగ్రహాన్ని అదే ప్రాంతంలో గతంలో యూకో బ్యాంకు నిర్వహించిన ప్రదేశంలో సురక్షితంగా, శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే ప్రదేశంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 5 సెంట్లు గాని, 3 సెంట్లుగాని స్థలాన్ని తమ సంఘానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది దుమంతి సత్యనారాయణ, జి.మణిమాల, టి.పండయ్య, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామలా వరలక్ష్మి, సహాయ కార్యదర్శి మాకాడ బూరుగులయ్య పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ యాప్‌లతో యువత ఆత్మహత్యలు

**ప్రజాశక్తి-పాడేరు:** ఆన్‌లైన్ యాప్‌తో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వీటిని నిషేధిం చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, ఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మణ్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ లక్షల మంది యువత క్రికెట్, రమ్మీ, ఇతర ఆటలు యాప్‌లో బెట్టింగ్ లు పెట్టి ఆర్థికంగా నష్టపోవడం తో పాటు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఘరానా మోసగాళ్ళు లివింగ్ యాప్ పేరుతో యువతను ఆకర్షించి వీడియో కాల్‌లో రికార్డ్ చేసుకుని బ్లాక్ మెయిల్ చేస్తూ లక్షల రూపాయల ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఫ్రెండ్స్ యాప్ ద్వారా పరిచయాలు పెట్టుకుని డబ్బులు ఇవ్వకపోతే మీ ఫ్రెండ్స్‌కు అశ్లీల మార్ఫింగ్ ఫొటోలు పంపుతామని బెదిరిస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడు తున్నారన్నారు. ఇటువంటి కారణంగా చాలా మంది అర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకోవడంతో పాటు ఎవరికి చెప్పుకోలేక మానసిక ఒత్తిడికి గురౌతున్నారన్నారు. ఈ యాప్ లను నిషేధించి, విధ్యార్థులను, యువతను, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించి, చెడు మార్గం పట్టకుండ చూడాలని కోరారు. ఈ విషయం పై కలెక్టర్ స్పందించి జిల్లా ఎస్.పితో మాట్లాడుతానన్నారు. ఈ వినతిపత్రాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

## పింఛన్ల పంపిణీలో చేతివాటం చూపిన వాలంటీర్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి -సీలేరు**

పింఛన్ పంపిణీలో చేతివాటం చూపించిన వాలంటీర్‌పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తక్షణమే చర్యలు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి కన్నబ్బాయి క్యాంపులో నివాసముంటున్న కిలో సరోజిని, పిల్లి శాంతమ్మ, బండారి గణేష్, బండారి లక్ష్మి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ తమకు జులై నెల పింఛను వాలంటీర్ బాబూలాల్ అలియాస్ అనిల్ నేటి వరకు ఇవ్వలేదని తెలిపారు. తమ పింఛను ఇవ్వాలని అనేకసార్లు వాలంటీర్ బాబూలాల్‌ను అడిగినా ఆయన స్పందించడం లేదని వాపోయారు. దీంతో గత్యంతరం లేక విలేకర్లను ఆశ్రయించినట్లు చెప్పారు. గతంలో బాబూలాల్ పింఛను వివిధ లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా రూ.2,1000 స్వాహా చేశారని, దీనిపై నాడు జీకే వీధి మండల ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఇప్పుడు రూ.2750 చొప్పున నలుగురికి చెందిన జులై పింఛన్లు అందజేయలేదని పేర్కొన్నారు. 1వ తేదీ నుండి రేపు రా.. మాపురా అని గడవు పెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నాడు తప్ప తమకు పింఛను డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు ఇంటికి వెళ్లి వాలంటీర్లు ద్వారా అందజేస్తుండగా, తమ వాలంటీర్ బాబూలాల్ మాత్రం అప్పుడప్పుడు చేతివాటం చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీలేరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించి చేతివాటం చూపించిన వాలంటీరీపై కఠిన చర్యలు తీసుకొని తమకు పింఛన్లు అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.



తమ గోడును వెల్లబుచ్చుతున్న పింఛనుదారులు

## సీలేరులో వర్షం

**ప్రజాశక్తి -సీలేరు :** జీకే వీధి మండలం సీలేరులో సోమవారం ఉదయం నుంచి 10 గంటల వరకు వర్షం కురిసింది. అనంతరం ముసురు రూపంలో సాయంత్రం వరకు చిన్న చిన్న చినుకులు పడ్డాయి. దీంతో సీలేరు పురవీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. దినసరి కూలీలు కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు, మూడు రోజుల నుంచి వర్షాలు ఒక మాదిరిగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయితీల పరిధిలోని గిరిజనులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. పోడు వ్యవసాయంలో దుక్కు పనులు చేపడుతూ మొక్కజొన్న, సామలు, రాజ్‌మా తదితర విత్తనాలు జల్లుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఇప్పటివరకు వరి ఆకులు పోయలేని దుస్థితి నెలకొంది.

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి-కొయ్యూరు :** సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు సాగిన బుజ్జిబాబు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సొమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే సీజనల్ వ్యాధులతో గిరిజనులు విలవిలలాడుతున్నారని, వాటి నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గిరిజనులు ప్రాణాలంటే ప్రభుత్వానికి ఎందుకంత నిర్లక్ష్యమన్నారు. వ్యాధులపై అవగాహన లేక అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు పోతేనే ప్రభుత్వాలు స్పందిస్తాయా? ప్రశ్నించారు. ముందుగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వాలు మొద్దు నిద్రపోతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వలను తొలగించి, ఆ ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయాలని, గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు.

## టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-అనంతగిరి:తెలుగు దేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు అంబిటరీ బుజ్జిబాబు కోరారు. సోమవారం మండలకేంద్రంలో టీడీపీ మండల కమిటి సమావేశం నిర్వహించారు. గ్రూపు రాజకీయాలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని అరకులోయ ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ గెలుపునకు అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆనంద్, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ అప్పారావు, సర్పంచ్ జన్ని అప్పారావు, జోగులు, దయానిధి, సుందరరావు, లక్ష్మణరావు, బుజ్జిబాబు, వెంకటరావు, జానకి, రంజిత్, లచ్చన్న, దేముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నఅబ్రహం

## 'మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి'

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా టిడిపి ప్రకటించిన నూతన మేనిఫెస్టోను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ ,ఎస్టీ కమిషన్ సభ్యుడు ఎం అబ్రహం చెప్పారు. స్థానిక మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి ప్రతి తకార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వి నాగేశ్వరరావు, ఎం.స్వామి, కే.సుబ్బారావు పాల్గొన్నారు.



ఎడతెరిపిలేని వర్షంలో గొడుగులు పట్టుకొని నడుస్తున్న విద్యార్థులు

## ముసురు పట్టిన మన్యం

ప్రజాశక్తి-యంత్రాంగం

**పాడేరు టౌన్:** మన్యంలో రెండు రోజులుగా ముసురు వాతావరణం కొనసాగుతోంది. ఆది, సోమవారాలు ఏజెన్సీ వ్యాప్తంగా మబ్బుల వాతావరణం, జల్లులతో కూడిన వర్షాలు పడుతోంది. పలు మండలాల్లో మోస్తరు వర్షం కురుస్తోంది. ఆయా ప్రాంతాల్లో జల్లులతో మొదలై ఒక మోస్తారు వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారి జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం గిరిజన రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులు చేపడుతుండటంతో తాజా వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఎడతెరిపిలేని వర్షం**

**డుంబ్రిగుడ:** మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వివిధ పనుల నిమిత్తం మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

# హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించండి

### ఎస్ఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల కళాశాలలో ఉంటున్న గిరిజన విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలని. మెను సక్రమంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.చిన్నారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హాస్టల్స్ నిర్వహణపై సర్వే నిర్వహించగా విద్యార్థులకు సంపూర్ణంగా మెనూ అమలు చేయలేదన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం అందక పోవడంతో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాలు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో నోట్ పుస్తకాలు, కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీచర్, లెక్చరర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న వసతి గృహ భవనాలను నాడు నేడు నిధులతో మరమ్మతు చేపట్టాలని తెలిపారు. వెంటనే అధికారులు విద్యార్థుల సమస్యలను పరిశీలించి పరిష్కారం చూపాలని లేకుంటే ఆందోళన చేపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు, జిల్లా నాయకులు జీవన్ మత్స్యరాజు, నరేష్, మాణిక్యం హెచ్చరించారు.

# జగనన్న సురక్షలో ధ్రువపత్రాల పంపిణీ



కంతారంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-యంత్రాంగం

**కొయ్యూరు :** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా పలు రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కంతారం గ్రామ సచివాలయంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హత ఉండి, సర్టిఫికెట్లు లేక సంక్షేమ పథకాలు పొందలేని వారు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, నూకాలమ్మ, స్థానిక సర్పంచ్ జంపా కణియమ్మ, ఉప సర్పంచ్ కాళ్ళ వనం బాబు, ఏఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి నాగమణి, రేగటి ముసలి నాయుడు, బండి సుధాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**శరభన్నపాలెంలో...**

మండలంలోని శరభన్నపాలెం గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అరకు ఎంపీ భర్త, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ మాట్లాడుతూ పలు కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్లకు శివప్రసాద్ కాళ్లు కడిగి పాదాభివందనం చేశారు. అనంతరం లబ్ధిదారులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, శరబన్నపాలెం సర్పంచ్ కిమిడి సత్యనారాయణ, ఎంపీటీసీ లోకుల సోమగాంధీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**హుకుంపేట:** మండలంలోని పట్టాం పంచాయతీ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అధికారి. ఆర్.వెంకటరావు, విద్యాశాఖ అధికారులు. చెల్లయ్య, ఈశ్వరరావు, ఆర్ఐ రంగారావులు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కించాయి కృష్ణ, పంచాయతీ విఆర్వో, కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.




హుకుంపేట మండలం పట్టాంలో ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు

# ఘనంగా శాకాంబరుని ఉత్సవం

ప్రజాశక్తి -పాడేరు: పట్టణంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం లో వెలసిన ఉమా నీలకంటేశ్వర స్వామికి సోమవారం శాకాంబరుని ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతులకు కూరగాయలు (శాఖముల)తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో ప్రతిష్టించిన ధ్వజస్తంభానికి ఆలయ ప్రాంగణంలో వెలసిన దేవతామూర్తుల కు శాఖములతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త కొట్ట గుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు వెంకటరత్నం, రామారావు, పోతురాజు, దాసరి నాగు బాలన్న, మాస్టారు భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### దాడి ఘటనలో ఒకరు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గండిగుండం సమీపం రామవరం వెళ్లే దారిలో ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో పాన్ షాప్ వ్యక్తితో పడిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... యారాడ సాయిబాబా టెంపుల్ ప్రాంతానికి చెందిన బంక అజయ్ (32), హోంగార్డు కోన శ్రీను (24) ద్విచక్రవాహనంపై రామవరంలో రమణ ఇంటికి ఆదివారం రాత్రి వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఎనిమిది గంటల సమయంలో బైక్‌పై అతివేగంగా వచ్చి రామవరం రోడ్డులో పక్కన ఉన్న అక్కిరెడ్డి బంగార్రాజు, జగదీశ్వరిల పాన్ షాప్ ముందు నిలిపారు. ఎవరు మీరు, ఎందుకు నిలబడ్డారని షాపు యజమాని బంగారురాజు ప్రశ్నించారు. దీంతో వాహనంపై వచ్చిన బంక అజయ్ వాగ్వాదానికి దిగాడు. బంగార్రాజును పిడుగుద్దులు గుద్దాడు. దీంతో బంగార్రాజు భార్య జగదీశ్వరి అడ్డుకునే ప్రయత్నం చేసింది. జగదీశ్వరి తండ్రి భీమవరపు దేముడు (46) తగాదాని చూసి బయటకు వచ్చి ప్రశ్నించారు. ప్రశ్నించిన దేముడు గుండెలపై అజయ్ బలంగా గుద్దాడు. దీంతో తీవ్ర నొప్పితో దేముడు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుమార్తె జగదీశ్వరి, అల్లుడు బంగార్రాజు ఆసుపత్రికి తరలించగా తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సిఐ రామచంద్రరావు, ఎఎస్ఐ పైడిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

### కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య


ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సెక్టర్ -1లో కణితి ఈశ్వరరావు (46) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు, మృతుని భార్య రమణమ్మ కథనం ప్రకారం... ఈశ్వరరావు స్టీల్‌క్లబ్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తాగి విధులకు హాజరుకావడంతో 15 రోజుల క్రితం స్టీల్‌క్లబ్ యాజమాన్యం సస్పెండ్ చేసింది. మానసికంగా వేదనకు గురైన అతను మరింత ఎక్కువగా మద్యం తాగుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తాగిన మత్తులో ఇంటికి వచ్చాడు. గదిలోకి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలైనా బయటకు రాకపోవడంతో భార్య రమణమ్మ తలుపు తట్టింది. ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో రమణమ్మ తన సోదరుడు ఆరిపాక గౌరీ శంకర్‌కు ఫోన్ చేసింది. గౌరీశంకర్ వచ్చాక బలవంతంగా తలుపు తెరిచారు. అప్పటికే అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నాడు.కిందికి దించి స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### బీసీ రోడ్డు షాపుల్లో చోరీ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బీసీ రోడ్డు షాపుల్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీకి సంబంధించి క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం... బీసీ రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరీ, ఫిష్ అక్వేరియంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. చోరీలో మొత్తం రూ.10 వేలు నగదు పోయినట్లు షాప్ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గీతంలో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో 2023 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన, వసతి గృహాలలో ప్రవేశాలు, అవగాహన తరగతులను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గీతం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో సందడి నెలకొంది. విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్కులతో పాటు బస్‌పాస్ సౌకర్యం తదితర సమాచార కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శివాజి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, గీతంలో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నామని, కెరీర్ గైడెన్స్ విభాగాన్ని బలోపేతం చేసామని తెలిపారు. గీతం నుంచి ఏటా 3000 వేల మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాలతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉచితంగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు అభ్యసించేలా “కురసెర” సంస్థతో ప్రత్యేక ఒప్పందం చేసుకున్నామన్నారు.



కార్యాలయంలో కానరాని అధికారి

## అదును పోతున్నా విత్తనాలు ఇవ్వరేం

### - అందుబాటులో లేని వ్యవసాయాధికారిపై చర్యలకు రైతుల డిమాండ్

ప్రజాశక్తి - విఆర్.పురం : ఖరీఫ్ సీజన్ వచ్చిన మండల వ్యవసాయశాఖ అధికారి అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో రేఖపల్లిలో తన కార్యాలయంలో వ్యవసాయ అధికారి అందుబాటులో లేకపోవడంతో ఈ సీజన్లో సబ్సిడీపై తమకు ఇవ్వాల్సిన విత్తనాలు అందడం లేదని, వాటి కోసం రోజులు తడబడి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారి నాలుగైదు రోజులు నుండి అందుబాటులో లేరన్నారు. నెలలో రెండుమూడు సార్లు మాత్రమే కార్యాలయానికి వస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విత్తనాల కోసం రోజూ వ్యయ ప్రయాసలకు ఓర్చి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని, అగ్రికల్చర్ సిబ్బందిని అడిగితే వ్యవసాయాధికారి లేరని చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఇలా అయితే తమ పరిస్థితి ఏమిటనీ, అదుపుపోతే వ్యవసాయం ఎలా సాగు చేస్తామని ప్రశ్నించారు. తక్షణమే ఉన్నతాధికారులు మండల వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలని, తమకు విత్తనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

## బినామీలకు షాపుల కేటాయింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎస్‌సి కార్పొరేషన్ సహాయంతో ఏర్పాటు చేసిన వాణిజ్య దుకాణాల సముదాయంలో బినామీలను రద్దుచేసి నిరుద్యోగ యువతీ యువకులకు షాపులు కేటాయించాలని ఎస్‌సి మోర్చా అధ్యక్షులు ములకలపల్లి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం దళితుల భూములు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వారి కోసం పెదగంట్యాడ మండలంలో ఎస్‌సి కార్పొరేషన్ సహాయ సహకారంతో 32 వాణిజ్య షాపుల సముదాయం నిర్మించిందన్నారు. ప్రస్తుతం అక్కడ బినామీల రాజ్యం నడుస్తోందని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు తెలుగు అర్జున్, ఎం.వంశీ పాల్గొన్నారు.

## రాజన్న ఆటోనగర్ కోసం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్క్రాప్ వర్కర్ల కోసం ఆనందపురం మండలం కమనం గ్రామంలో రాజన్న ఆటోనగర్ నిర్మించాలంటూ స్క్రాప్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2019లో స్క్రాప్ వర్కర్స్ స్మార్ట్ సిటీ పేరిట ఆనందపురం మండలం కమనం గ్రామం వద్ద 157.7 ఎకరాలను కేటాయించారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత రాజన్న ఆటోనగర్ పేరిట దీనికి సంబంధించిన జిఒ కూడా వచ్చిందని, అయినప్పటికీ ఇంతవరకూ సదరు కార్మికులకు ఆ స్థలాన్ని ఇవ్వలేదని అన్నారు. ఈ సమస్యపై మూడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

**త్వరలోనే పనులు చేపడతామని కలెక్టర్ వెల్లడి**

రాజన్న ఆటోనగర్ నిర్మాణానికి రూ.14 కోట్లు విడుదలయ్యాయని, మరో రూ.4 కోట్లు నాలుగు రోజుల్లో విడుదల కానున్నాయని, ఆ వెంటనే ఆటోనగర్ నిర్మాణ పనులను చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారని సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, స్క్రాప్ వర్కర్లు తెలిపారు. నిధులు మంజూరుపై స్క్రాప్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్, సత్యనారాయణ, గణేష్ హర్షం వ్యక్తం చేశారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు స్పందిస్తూ అందరూ ఐక్యంగా ఉద్యమంలో పాల్గొంటేనే విజయం సాధ్యమన్నారు.

### అదానీ గంగవరం పోర్టు

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### వాటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిఐటియు) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి.నందకుమార్ టి.నరేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. క్రోనీ క్యాపిటలిస్ట్ విధానంలో భాగంగా జరిగిన ఒప్పందంలో గంగవరం పోర్టు పూర్తిగా అదానీ చేతికి వెళ్లిందన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా మోడీ ప్రభుత్వ ప్రేరేపిత, తిరోగమన విధానానికి అనుగుణంగా వ్యవహరించారని విమర్శించారు. గంగవరం పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్న తర్వాత కార్మికులపై శ్రమ దోపిడీ తారాస్థాయికి చేరిందన్నారు. పోర్టు కోసం త్యాగాలు చేసిన వారిని విస్మరించడం శోచనీయమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు కొద్ది రోజులుగా దీక్షలు, ధర్నాలు చేస్తున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. పోర్టు కార్మికుల పోరాటానికి అన్ని రాజకీయ పార్టీల, కార్మిక, ప్రజా సంఘాల మద్దతు లభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సమస్యను పోర్టు యాజమాన్యం, అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖపట్నంతో సహా అన్ని మేజర్ పోర్ట్‌లు, అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న ఇతర పోర్టుల్లోని కార్మికులనూ ఏకం చేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అలాగే మేజర్ పోర్టుల వేతనం ఒప్పందంపై విశాఖలోని నోవాటల్ హోటల్‌లో ఆదివారం చర్చలు జరిగాయని, ఐదు సంవత్సరాల పిరియడ్‌కు యాజమాన్యం అంగీకరించిందని అన్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీలలో ఢిల్లీలో మరో సమావేశం జరగబోతుందన్నారు. ఈలోపు సమస్యలను పరిష్కరించకుంటే పోర్టు కార్మికులు సమ్మెకు దిగుతారని తెలిపారు. సమావేశంలో విశాఖపట్నం పోర్టు యూనియన్ గౌరవ అధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, బి.జగన్ పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందకుమార్, నరేంద్రరావు

**కలెక్టర్‌కు కార్మిక సంఘాల వినతి**

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, గంగవరం పోర్టు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణ కోసం గంగవరం, దిబ్బపాలెం మత్స్యకారులు తమ ఇళ్లను, భూములను, ఉపాధిని కోల్పోయారన్నారు. అటువంటి వారికి పోర్టులో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. 14 సంవత్సరాలకుపైగా పనిచేస్తున్న కార్మికులకు సైతం రూ.13 వేలు నుంచి రూ.16,600కి మించి రావడం లేదన్నారు. డ్యూటీలో జాయిన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.3,700 బేసిక్ మాత్రమే కొనసాగుతోందన్నారు. కనీస వేతనం రూ.36 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. పోర్టులో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు.

**సిపిఐ మద్దతు**

**గాజువాక :** అదానీ గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న ఉద్యమానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కనీస వేతనాల అమలు కోసం అదానీ గంగవరం పోర్టు కార్మికులు పెదగంట్యాడలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారానికి 14వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సందర్శించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా అదానీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ, తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. పోలీసు బలగాలతో కార్మిక ఉద్యమాన్ని అణచాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సత్యాంజనేయ, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, ఎ.విమల, భేగం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు, కె.అచ్యుతరావు, గాజువాక నియోజకవర్గ నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, వై.నందన్న పాల్గొన్నారు.

# చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇకో-వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 7వ తేదీన నిర్వహించిన పర్యావరణంపై చిత్రలేఖన పోటీలలో ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులలో పర్యావరణంపై సృజనాత్మకను పెంపొందించేందుకు ఇటువంటి చిత్రలేఖన పోటీలు అవసరమన్నారు. 592 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 30 వేల మంది విద్యార్థులు ఈ చిత్రలేఖన పోటీల్లో పాల్గొనగా వారిని సీనియర్, జూనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, 3వ బహుమతి రూ.10 వేలు, అలాగే జూనియర్ విభాగానికి మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, 3వ బహుమతి విభాగానికి ఇద్దరిని ఎంపిక చేసి, వారికి ఒక్కొక్కరికీ రూ.3500 చొప్పున బహుమతులు ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్, మెమొంటోలు ఇస్తున్నామన్నారు.




నిరసన తెలుపుతున్న తోపుడు బండ్ల కార్మికులు

## తోపుడు బళ్ల కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొత్త వెంకోజీపాలెం జంక్షన్ వద్ద తోపుడు బళ్లను జివిఎంసి, సచివాలయ సిబ్బంది అన్యాయంగా తొలగించడంపై సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ తోపుడుబండ్ల కార్మికులకు రక్షణ కల్పించాలని, వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. వాటిని ధిక్కరిస్తూ అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. తోపుడుబండ్ల కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని, నగర పరిధిలో హాకర్ జోన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీ వీరాంజనేయ తోపుడుబండ్ల సంక్షేమ సంఘం కొత్త వెంకోజి పాలెం కమిటీ అధ్యక్షులు ఎం.అర్చన, కార్యదర్శి ఎం.శివ పాల్గొన్నారు.

## ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ఈ విద్యా సంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటూ ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పిజి కోర్సులలో ప్రవేశాలు గడువులోపు లభిస్తాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ ఇగ్నో అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలను పెంచే కొత్త కోర్సులను ముందుకు తెచ్చిందని పేర్కొన్నారు. https://ignouadmission.samarth.edu.in లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, మరిన్ని వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు.

## శాంతి ఆశ్రమ భూముల రక్షణకు వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోని శాంతి ఆశ్రమం భూముల్లో కబ్జాలు తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. సోమవారం స్పందనలో ఈ మేరకు కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతి ఆశ్రమం భూములలో అక్రమ షెడ్ల ద్వారా నెల నెలా లక్షల్లో అద్దెలు వస్తున్నాయన్నారు. ఆ భూములలో మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన మార్కెట్, ప్రొసెసింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఇదే విషయమై జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకూ వినతిపత్రం అందజేశారు.

## స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సిపిఐ కార్పొరేటర్ దూరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 19న జరగనున్న జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ దూరంగా ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్పొరేటర్ స్టాలిన్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. స్టాండింగ్ కమిటీలో 10 మందిని ఎన్నుకోవలసి ఉండగా అధికార వైసిపి నుంచి పది మంది, టిడిపి నుంచి పది మంది పోటీలో ఉన్నారని చెప్పారు. అయితే ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఐగా ఈ ఎన్నికలలో పాల్గొనకుండా దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు.